కథానిక

# పెళ్ళిచూపులు

మధిర భానుమూర్తి

ఇల్లంతా కలకలలాడుతోంది. ఇప్పుడే ఇంటికి పెళ్ళికళ వచ్చేసింది. కావలసిన వాళ్ళు నలుగురూ వచ్చారు, ఇక పెళ్ళివారు వచ్చే వేళకూడా దగ్గిర పడుతోంది. వాళ్ళు వచ్చేలోగా చెయ్యవలసిన ఏర్పాట్లన్నీ సవ్యంగానే జరిగి పోతున్నాయి. పెళ్ళివారు ఏ వేళ వస్తారోనని పిల్లని ఎక్కడికీ కదల వద్దని చెప్పారు. పైకి అయిష్టంగా కనిపిస్తూనే ఎక్కడకీ వెళ్ళకుండానే ఇంట్లోనే కూచుంది అమ్మాయి.

పెళ్ళికొడుకు మంగళూరులో ఇంజనీరింగు చదువుతున్నాడట, మంచి సాంప్రదాయమైన కుటుంబం ఆయన చాలా గొప్ప ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు నలుగురు పిల్లలు. అందులో ఇద్దరు ఆడపిల్లలకి ఘనమైన సంబంధాలుచూసి చేశాడు. అల్లుళ్ళు ఇద్దరూ ఇప్పుడు మంచి హోదాలో ఉన్నారు. పెద్దకొడుకు దేశాల్ని పట్టుకు తిరుగుతున్నాడు నౌకరీలో ఉండి. ఈ పెళ్ళికొడుకు రెండోవాడు. స్కూలు ఫైనలు అయాక ఇంజనీరింగు చదువుతున్నాడట. ఏదో కుర్రాడి వాటాకి రెండెకరాల భూమి ఉంది. ఉండడానికి ఒక శుభ్రమైన లోగిలి ఉంది. పరువు మర్యాదలకేమీ లోటులేదు. వేలు వంపులేని సంబంధం. ఇన్ని ఆలోచించి వాళ్ళ గుమ్మం తొక్కాడు సోమనాథంగారు పిల్లనిస్తానని.

విమల సోమనాథంగారి పెద్దపిల్ల. ఇదే ఆయన చేస్తున్న మొదటి శుభకార్యం. కొడుకు విమల కన్న పెద్దవాడే. వాడు చదువుకుంటున్నాడు. ఈ అమ్మాయికి పెళ్ళి చెయ్యాలనుకుని సంబంధాలు చూడడం మొదలు పెట్టినప్పటినుంచి ఆయనకి ఎన్నో సమస్య లెదురయాయి. సంబంధాలెన్నో చూస్తున్నాడుగాని ఒక్కటీ తృప్తిగా ఉండడంలేదు. ఆస్తి ఉంటే రూపం ఉండదు. ఆస్తి, రూపం ఉంటే గుణం ఉండదు. ఈ మూడూ ఉంటే చదువుండదు. అన్నీ సరిగావున్న సంబంధమయితే వాళ్ళు చేసుకోరు. ఇలాగ ప్రతి సంబంధం విషయంలోనూ ఏదో ఒక లోటు కనిపించి తీరుతోంది. పెళ్ళిచెయ్యటం చాలా కష్టంగా ఉంది. అలాగని తను అనుకున్న గుణాలు అన్నీ లేనివాడిని ఎవడినో ఒకడిని తెచ్చి పిల్లని కట్టపెట్టడం ఆయనకు ఇష్టంకాదు. అందుకని ఆయన ఎంతో శ్రమ పడవలసి వచ్చింది.

వాకబు చేస్తుండగా ఎవరో చెప్పారు ఈ సంబంధాన్ని గురించి ఇకనేం? తను అనుకున్నవన్నీ ఉన్నాయి. ఏవిధంగానూ ఇంకొకరు వేలెత్తి చూపేందుకు వీలులేనిది అయినప్పుడు ఇంక ఆలస్యమెందుకని వెంటనే వెళ్ళి చెప్పివచ్చాడు పిల్లని చూసుకుందుకు రమ్మని.

ఇంటికి రావడంతోటే అడిగింది భార్య. "ఏమన్నారండీ? వస్తానన్నారా! ఎప్పుడువస్తారు? ఏమిటి?" అని. సవిస్తరంగా ఆమెకు చెప్పాడు విషయం యావత్తూ. "వాళ్ళు అంత ఉన్నవాళ్ళు గదా అని ఏమన్నా ఎగిరిపడటం అదీ ఉందనేమిటి? ఏమీలేదు. విత్తం, విత్తానికి తగ్గవిద్య, విద్యకి తగ్గవినయం ఇవన్నీ ఉన్నాయి. వాళ్ళు వచ్చినప్పుడు నువ్వేచూస్తావుగా! ఆవిడ నీ వియపరాలు ఎంత మంచిదనుకున్నావు? ఇంతకీ పిల్లదాని నోము మంచిది. లేకపోతే ఇంత అనుకూలమైన సంబంధం ఎందుకుదొరుకుతుంది"అని సంతోషంగా అన్నాడు.

ఆ సంతోషంలోనే పిల్లని చూసుకుందుకువాళ్లు వస్తున్నారంటేనే వెళ్ళంత పనిచేస్తున్నాడు. కుర్రాడిని బజారుకి పంపి మంచి ఖరీదైన తినుబండారాలు కొన్ని తెప్పించాడు. అవిగాక ఇంకా ఇంట్లో ఎన్నో చేయించాడు. పేరుకి టిఫనే అయినా తినటానికి భోజనాన్ని మించేటట్టు తయారయింది. "ఇవన్నీ ఎందుకండీ? మీది మరీ అతి ధోరణిగాని ఒకొక్కరు చూసుకుందుకు వచ్చి

నప్పుడల్లా ఇంతంత ఏర్పాటు చెయ్యాలంటే ఎంత డబ్బూ చాలదు. దేనికేనా మితి అంటూ ఉండాలి." అంది సోమనాథంగారి భార్య.

"అంటే నీ అభిప్రాయం మన పిల్లని ఇంకా ఎందరికి చూపించాలని?" అని అడిగాడు.

"ఏమో! ఎవరు చెప్పగలరు? వాళ్ళు వస్తూనే పిల్లకి పుస్తి ముడివేయిస్తారని ఏమిటి నమ్మకం. అది కాక పోయినా పిల్లలపెళ్ళిళ్ళు చేసిన వాళ్ళూ ఉన్నారుగాని మరీ ఇంత చేటా!" అని నోరు నొక్కుకుంది.

"వాళ్ళ అంతస్తుకి మనం చేసేదేమీ పెద్దవిశేష మైనది కాదు. వాళ్ళు బాగా ఉన్నవాళ్లు. మర్యాదకి మనుష్యులు. తగిన మర్యాదలు చెయ్యాలి. ఆవిడ హెచ్చరించింది కూడాను: మేం నలుగురం కలవాళ్ళం. పిల్లని చూసుకుందుకు పదిమందిమీ వస్తాం. మాట కలకాలం నిల్చిపోతుంది. వచ్చే వాళ్ళకి మర్యాదలు మాత్రం జాగ్రత్తగాచెయ్యాలి ఏ మాత్రం లోటయినా వాళ్ళు చాలా నొచ్చు కుంటారు. తీరా తీసుకువచ్చినందుకు మాట నేను పడవలసి వస్తుంది. అని అందుచే వాళ్ళకి మర్యాదలు తగినట్టుగానే చెయ్యాలి. అయినా ఈ ఖర్చులూ, గొడవలూ నీకెందుకూ?"అన్నాడు.

సోమనాథం ఆ ఊళ్ళోవున్న తనచుట్టాలకి కూడా చెప్పాడు. 'ఫలానా' వాళ్ళు పిల్లని చూసు కుందుకు వస్తున్నారని, వాళ్ళవందరినీ పెళ్ళి కొడుకుని చూసేందుకు రమ్మన్నారు. అంతా వచ్చారు. వారు వచ్చేవేళ సమీపిస్తున్నకొద్దీ సోమనాథం ఆత్రుత ఎక్కువయింది. పిల్లని బాగా ముస్తాబుచెయ్యమని ఒకసారికి రెండుసార్లు భార్యకి చెప్పాడు. ఆమెచేసిన ముస్తాబులో తనకుతోచిన మార్పులు దగ్గిర ఉండి చేయించాడు. మిగిలిన పనులన్నీ తనే పురమాయించి స్వయంగా చేయించాడు. వచ్చినవాళ్ళంతా ఆ తయారీమీద ఉన్న పిల్లనిచూసి తప్పకుండా ఈ సంబంధం స్థిరపడుతుం దన్నారు. అందరిమాటలూ వింటూంటే అతనికి సంతోషంగానే ఉంది. గాని పిల్లకి దృష్టిదోషం తగులుతుందేమోనని కొంచెం భయం కూడా లేకపోలేదు.

ఇంతలో గుమ్మంలో బండి ఆగిన చప్పుడయింది. సోమనాథం వీధిలోకి వెళ్ళాడు. రెండు బళ్ళల్లోంచి దిగారు పెళ్ళివారు. వస్తూనే పెళ్ళికొడుకు తల్లి చాలా చనువుగా లోపలికివచ్చి నలుగురితోనూ కలుపుగోలుగా తిరుగుతూ తనతో వచ్చినవారి నందరినీ పరిచయంచేసింది. పెళ్ళికొడుకు తల్లి, తండ్రి, ఇద్దరుకూతుళ్ళు, అల్లుళ్ళు, కుర్రాడిస్నేహితు లిద్దరు, ఇంకా ఎవరో ఇద్దరు దూరపుబంధువులు వచ్చారు. వాళ్ళనందరినీ సవినయంగా లోపలకి ఆహ్వానించాడు సోమనాథంగారు. అందరికీ కాళ్లు కడుక్కుందుకు నీళ్ళు, మంచినీళ్ళు ఇచ్చారు.

అసలు సంగతి ఆవిడ చివరకి చెప్పింది. పెళ్ళి కొడుక్కి వీలులేక రాలేదని. అందుచేత ఆవిడ కుర్రాడి ఫొటో తెచ్చిందట. ఆ ఫొటోచూసి పెళ్ళి నిశ్చయించుకోవచ్చునని సలహాయిచ్చిం దావిడ. ఈ మాటవిన్న సోమనాథానికి కొంచెం కోపంవచ్చింది. కాని తమాయించుకున్నాడు.

పెళ్ళికొడుకు తల్లిలోపలకి వస్తూనే వరసలు కలిపి చనువుగా మాట్లాడటం మొదలుపెట్టింది. "అబ్బో! అన్నగారు చాలా ఏర్పాట్లు చేశారే బాగుంది. ఇప్పుడే పెళ్ళంత హడావుడి చేశారు. నేను అవాళ అలా అన్నానని కాబోలు ఏం చెయ్యను? కొందరి ఇళ్ళకి వెడితే పచ్చిమంచి నీళ్ళయినా కావాలా అని అడిగిన వాళ్ళు లేక పోయారు. అందుకని అలాగ చెప్పాను. అంతే కాని మిమ్మల్ని ఇంత శ్రమపెట్టడం నాకు మాత్రం సరదా అంటారా? సరే! జరిగిందేదో జరిగిపోయింది. ఇంక అట్టే ఏమీ చేయించకండి, ఇప్పటికి వున్నవి చాలు ఏవమ్మా! వదినా (పిల్ల తల్లితో) ముందే నలుగురూ చూసుకుంటే మంచిదని మావాళ్ళని నలుగురునీ తీసుకువచ్చాం. ఆది నిష్ఠూరమే మంచిది గదా! అని ఎటొచ్చీ మీ అల్లుడే రావటానికి వీలులేక పోయింది. దూరపు ఊళ్ళల్లో ఉంటే ఇలాగే ఉంటాయి. అందులోనూ ఇంజనీరింగు చదువాయిరి! సామాన్యమేమీ కాదు... మాటలా అన్నప్పుడూ రావటానికి? మామూలు చదువు లయితే నాలుగు రోజులు మానినా ఫరవాలేదు. ఇంజనీరింగు చదువుతూ మానేందుకు వీలా? ఏమోయ్! అల్లుడూ! ఏమంటావ్?" అని సోమ నాథం కొడుకుని ప్రశ్నించింది.

ఆ కుర్రాడు ఆవిడ గర్వం కొంచెం అణచాలని "అవునుగాని అత్తయ్యగారూ మీవాడు మంగ

షూరులో చదువుతున్నాడన్నారు. అక్కడఉన్న చదువు అంత పెద్దదికాదే! మావాడు ఓవర్సీరు కోర్సు చదువుతున్నాడన్న మాట" అన్నాడు.

"ఏమండీ! బెల్లంకొట్టిన రాయిలా అలా పడి ఉంటారేమిటి? ఏమాటా చెప్పరేం? మనవాడికి పెద్దఉద్యోగం అవుతుందని అన్నారుగా! బోలెడు సంపాదిస్తాడన్నారుగా! చెప్పండి! వట్టి ఓవర్సీరు అవుతాడని అంటారేమిటి—అతను?"

"వాడు బాగా సంపాదిస్తాడన్నానుగాని పెద్ద ఉద్యోగం అని నేననిదే? వాడు చదువుతున్నదే ఓవర్సీరు కోర్సయితే అంతకంటె పెద్ద ఉద్యోగం వస్తుందని ఎలా అనుకుంటాం? అసలు ఉద్యోగానికి, సంపాదనకీ తేడావుంది తెలుసా?" అని ఆయన వున్నమాట చెప్పాడు.

అది నిజమే అయినప్పటికీ అందరిలోనూ ఆయన ఆమాట చెప్పటం ఆవిడకి బాధగా ఉంది. ఈమాట అనవచ్చునా? అనకూడదా? ఈమాట ఎక్కడ చెపుతున్నాము? అనే ఆలోచనేనా ఆయనకు లేకపోయినందుకు ఆవిడ చాలా నొచ్చుకుంది. ఈ తీరువ మనిషని నాకు తెలిసి ఉన్నప్పుడు ఈయన్ని తీసుకురావడం బుద్ధి తక్కువ నాది ఆపని చేసేసి ఇప్పుడు బాధ పడితే ఏంలాభం?" అని తనని తనే లోపల తిట్టుకుని, ఇంకా ఆలస్యమయితే, ఇంకా ఎంతలేసి తెలివితక్కువ మాటలు మాట్లాడుతాడోనని భయపడి "ఇంకా ఆలస్యమెందుకు శమ్మా వదినా?... పిల్లని తీసుకురండి." అని పురమాయించింది.

అంతకుముందే తయారుచేసి ఉంచిన పిల్లని తీసుకువచ్చి కూచోబెట్టింది సోమనాథం భార్య. వచ్చిన పదిమందీ పది ప్రశ్నలు వేశారు. ఎలాగయితేనేం? చూపులయాయి. ఎన్నో పరీక్షలు చేశారు. ఫలితాలు తరువాత ప్రకటిస్తామన్నారు. లేవబోతుండగా కాస్త కాఫీ,టిఫెను తీసుకువెళ్ళమని సోమనాథం గారు బలవంతం చేశారు. బలవంతం ఎక్కువయి చివరకి వప్పుకున్నారు. ఆ సమయంలో మధ్యవర్తిద్వారా చెప్పించాడు సోమనాథం తను నాలుగువేల రూపాయలు కట్నంఇచ్చి యథాశక్తి లాంఛనాలు జరుపుతాననీ. ఆమాట విన్న కుర్రాడి తల్లి తోకతొక్కిన త్రాచులాగ లేచింది. కోపం ప్రస్ఫుటంగా ఆమె ముఖంలో కనిపించింది. ముఖం బాగా ఎర్రబడింది. ఆవేశం హెచ్చింది. "ఇక లేవండి వెడదాం." అంది భర్తతో. ఆయన లేచాడు. "ఇంటికివెళ్ళి మీకు తెలియపరుస్తాం." అని సోమనాథంతో చెప్పారు. అంతా బయలుదేరి వెళ్ళారు.

మధ్యవర్తి రెండురోజులు పోయాక వచ్చాడు "నాలుగువేలిస్తాడట!—నాలుగువేలు ఎవడిని ఉద్ధరించనో! పదివేలు, పదిహేను వేలు ఇస్తామని వచ్చిన వాళ్ళకే ఎక్కడా దిక్కులేదాయిది!... వీడెంత? వీడి నాలుగువేలెంత? మాకు ఈ సంబంధం అక్కర్లేదని చెప్పు" అని పిల్లాడితల్లి అన్నమాటలు యథాతథంగా సోమనాథానికి విన్నవించాడు. తన అదృష్టమంతేనని విచారించాడు సోమనాథం.

వీళ్లు ఇలా మాట్లాడు తుండగా సోమనాథం పినతండ్రికొడుకు వచ్చాడు. "ఏం అన్నయ్యా! అమ్మాయికేదో సంబంధం తెచ్చావుట... కుదిరిందా!..ఎవరువాళ్ళు?"అని అడిగాడు. సోమనాథం వివరాలన్నీ చెప్పాడు.

"అయితే ఏపాటిఖర్చు చేశావేమిటి?" అని అడిగాడు ఆయన.

"ఒక వందరూపాయలయాయి మొత్తం..." అన్నాడు సోమనాథం.

"అన్నయ్యా! నువ్వు కూడా మోసపోయావూ?..."

"ఏం? అదేమిటి?..."

"అయితే నీకూ తెలియదన్న మాట?...విను... వాళ్ళకి మేనరికం ఒకటి సిద్ధంగా ఉంది. అదే చేసుకుంటారు వాళ్ళు....కాని పిల్లనిస్తానని వచ్చిన చోటికల్లా తయారవుతారు చూడడానికి ఒక సర్కసు కంపెనీలాగ...ఇక్కడ ఈ విందు భోజనాలన్నీ ఆరగించి, పిల్లనిచూసి వెడుతుంటారు. అదీ వాళ్ళకథ. ఇది తెలియక నేనుకూడా మా పిల్లని చూపించేందుకు తీసుకువచ్చాను వెనక ఒకసారి." అన్నాడాయన.

ఆ మాటలు వింటూనే సోమనాథం నిశ్చేష్టుడయాడు. ఇంకా సంబంధాలు వెతకటం తప్ప లేదుగదా అని. లోకంలో ఇలాంటివాళ్ళుకూడా ఉంటారు కాబోలు అనుకున్నాడు. ★